ప్రజాశక్తి
బుధవారం 3 ఏప్రిల్ 2024
5
విజయనగరం

15 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఇప్పటివరకు 15 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి నిర్మలాదేవి తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన దగ్గరనుంచి ఏప్రిల్ 1 వరకు, జిల్లాలో వాలంటీర్లకు సంబంధించి మొత్తం 29 ఫిర్యాదులు అందాయని, వీరిలో 14 మందిని ఇప్పటివరకు తొలగించగా, మిగిలిన 15 మంది రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులుగా సామాన్యులు

ఉమ్మడి విజయనగరంలో ఏడు స్థానాలకు ప్రకటన

విజయనగరం జిల్లా

సుంకరి సతీష్‌కుమార్
విజయనగరం

గాదపు కూర్మినాయుడు
గజపతినగరం

తుమ్మగంటి శ్రీనివాసనాయుడు
చీపురుపల్లి

కంబాల రాజవర్ధన్
రాజాం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా పలు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ అభ్యర్థులను అధిష్టానం ప్రకటించింది. 114 అసెంబ్లీ స్థానాల్లో బరిలోకి దింపనున్న అభ్యర్థుల జాబితాను పిసిసి విడుదల చేసింది. ఇందులో భాగంగా విజయనగరం జిల్లా పరిధిలో నాలుగు, పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వీరంతా సామాన్యులు కావడం విశేషం. విజయనగరంలో సుంకరి సతీష్‌కుమార్, గజపతినగరం నుంచి గాదపు కూర్మినాయుడు, చీరుపుపల్లి నుంచి తుమ్మగంటి శ్రీనివాస నాయుడు, రాజాం నుంచి కంబాల రాజవర్ధన్ బరిలోకి దిగనున్నారు. ఇంకా నెల్లిమర్ల, ఎస్.కోట, బొబ్బిలి నియోజకర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సివుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం అభ్యర్థిగా బత్తిన మోహనరావు, సాలూరు అభ్యర్థిగా ముువ్వల పుష్పారావు, పాలకొండ అభ్యర్థిగా సరవ చంటిబాబు ఉన్నారు. ఈ రెండు జిల్లాల్లో ఇప్పటి వరకు ప్రకటించిన వారిలో అంతా సామాన్యులే. కొందరికి గ్రామ, మండల స్థాయిలో స్థానిక, సామాజిక సమస్యలపై పోరాడిన నేపథ్యం ఉంది. వీరిలో సతీష్‌కుమార్ విజయనగరంలోని మంగళ వీధికి చెందినవారు. డిసిసి మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు యడ్ల ఆదిరాజుకు స్వయాన మేనల్లుడు. బిఎ పూర్తిచేసిన ఆయన చాలా ఏళ్లగా కాంగ్రెస్‌లో ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. చీపురుపల్లి అభ్యర్థి తుమ్మగంటి సూరినాయుడు గరివిడి మండలం గడ్డపువలసకు చెందినవారు. 2021లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. తొలుత ప్రజారాజ్యంలో పార్టీ రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా, విశాఖపట్నం జిల్లా ఇంఛార్జ్‌గా పనిచేశారు. అనంతరం జనసేన, ఆ తరువాత వైసిపిలో చీపురుపల్లి ఇంఛార్జిగా పనిచేశారు. 2014లో వైసిపి ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించారు. రాజాం నియోజకవర్గం అభ్యర్థి కంబాల రాజవర్ధన్ పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ మండలం, చిన్న మంగళాపురం గ్రామానికి చెందినవారు. తండ్రి కంబాల రాజరత్నం గతంలో పాలకొండ ఎమ్మెల్యేగా సేవలందించారు. విదేశాలలో కొన్నేళ్లపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేశారు. 2018 నుంచి రాజాం నియోజకవర్గంలోనే కాంగ్రెస్ పార్టీ తరపున పనిచేస్తున్నారు. గజపతినగరం అభ్యర్థి గాదపు కూర్మినాయుడు దత్తిరాజేరు మండలం గొభ్యాం గ్రామానికి చెందిన వారు. సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న నేపథ్యం ఉంది. చాలా కాలంగా కాంగ్రెస్ అభిమానిగా ఉన్నారు. పార్వతీపురం అభ్యర్థి బత్తిన మోహన్‌రావు పాలకొండ ప్రాంతానికి చెందినవారు. తొలుత శ్రీకాకుళం జిల్లా యూత్ కాంగ్రెస్‌లో పనిచేశారు. వృత్తిరీత్యా న్యాయవాది. ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ సమస్యలపై పనిచేసిన నేపథ్యం ఉంది. 20ఏళ్లగా అఖిల భారత దళిత హక్కుల ఫోరం, రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి న్యాయవాదుల ఫోరం లో పని చేస్తున్నారు. పాలకొండ కాంగ్రెస్ అభ్యర్థి సవర చంటిబాబు సీతంపేట మండలం కుసిమి పంచాయతీ బంగారుగూడకు చెందినవారు. తండ్రి సవర తోటయ్య గతంలో కుసిమి పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఈ కుటుంబం తొలి నుంచీ కాంగ్రెస్‌తోనే ఉంది. రాష్ట్ర విభజన తరువాత కూడా అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. సాలూరు అభ్యర్థి మువ్వల పుష్పారావు సాలూరు మండలం తుండ పంచాయతీ జగ్గుదొర వలసకు చెందిన గిరిజన యువకుడు. గిరిజన సమస్యలపై గత కొంతకాలంగా పోరాటాలు చేస్తున్నారు. పోలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేశారు. షెడ్యూల్ గ్రామాల యువకులకు ఉద్యోగాల కోసం షెడ్యూల్ ధ్రువపత్రాలు మంజూరు చేయాలని జగ్గుదొరవలస కేంద్రంగా ఉద్యమం నిర్వహించారు.

పార్వతీపురం మన్యం జిల్లా

మువ్వల పుష్పారావు
సాలూరు

బత్తిన మోహనరావు
పార్వతీపురం

సవర చంటిబాబు
పాలకొండ

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

- సచివాలయాల వద్ద షామియానా, తాగునీరు కల్పన
- వికలాంగులకు, రోగులకు ఇంటివద్దే..
- వడగాల్పులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- టెలికాన్ఫరెన్సులో అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో ఈనెల 4వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సామాజిక ఫించన్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఆయా సచివాలయాల వద్ద ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు ఫించను మొత్తాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం మండల స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి వడగాల్పుల నుంచి రక్షణకు చేపట్టాల్సిన చర్యలు, మండలాలు, మునిసిపాలిటీల్లో ఫించన్ల పంపిణీకి చేయాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో ఈనెల 3వ తేదీన ఫించను మొత్తాలకు సంబంధించిన నిధులు జమ అవుతాయని, వాటిని మండలాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు, పట్టణ ప్రాంతాల్లో వార్డు పరిపాలన కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు ఈ నగదు మొత్తాలను విత్‌డ్రా చేసి పింఛను పంపిణీచేసే సచివాలయ సిబ్బందికి అందజేయాలని ఆదేశించారు. వికలాంగులు, వివిధ రకాల తీవ్రవ్యాధులతో బాధపడుతున్న వారు, మాజీ సైనికుల ఫించను పొందుతున్న వితంతు మహిళలు, మూడు చక్రాల సైకిల్ సహాయంతో వెళ్లాల్సి వున్న వారు మినహా మిగిలిన వారంతా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఏర్పాటుచేసే కౌంటర్ల నుంచి ఫించను మొత్తాలు తీసుకోవాలన్నారు. ఫించను అందజేసే చోట తాగునీరు, నీడకోసం షామియానాలు, ఫించనుదారులు కూర్చొనే ఏర్పాట్లు చేయాలని, దీనికోసం ఆయా స్థానిక సంస్థల జనరల్ ఫండ్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. మధ్యాహ్నం వేళల్లో ఫించను మొత్తాల పంపిణీ చేపట్టవద్దని ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే పంపిణీ చేయాలన్నారు. సచివాలయానికి ఐదు కిలోమీటర్లు పైగా దూరం గల గ్రామాల్లో నివసించే ఫించనుదారులకు ఆయా గ్రామంలోని పాఠశాల లేదా ఏదైనా ప్రభుత్వ కార్యాలయం వద్ద ఫించను మొత్తం అందించే ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 6వ తేదీ నాటికి అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఫించన్ల పంపిణీ పూర్తికావాలని స్పష్టం చేశారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, వడగాలు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. ఏప్రిల్‌లో 46 డిగ్రీలు, మేలో 46.6 డిగ్రీలు సగటు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయట సంచరించినట్లయితే వడదెబ్బకు గురయ్యే అవకాశం వుంటుందని తెలిపారు. సాధ్యమైనంత వరకు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని కోరారు. ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు పనిచేసే స్థలంలో తగిన నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు అందుబాటులో ఉంచాలన్నారు.

యువసంగంలో ఎంవిజిఆర్ విద్యార్థిని

ప్రజాశక్తి-డెంకాడ

ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని అనూష నీలా త్రిపురలో జరిగిన యువ సంగం ఫేస్ 4లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిధ్యం వహించింది. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ యువ సంగం ఫేజ్ 4 కార్యక్రమం ప్రధానంగా ఉన్నత విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు, దేశమంతటా కొన్ని క్యాంపస్ యువతీ యువకులతో ఎక్స్‌పోజర్ టూర్‌ను నిర్వహిస్తుంది. జీవితంలోఅనే కోణాలు, అభివృద్ధి ల్యాండ్ మార్కులు, విజయాలపై వివిధ రాష్ట్రాల నుంచి హాజరయ్యే విద్యార్థులు వివరిస్తారు. పర్యాటకం, సాంప్రదాయాలు, అభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్ తరపున హాజరైన అనూషకు త్రిపుర రాజ్‌భవన్‌లో స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసి శేఖర్, మోహన్ కుమార్ తదితరులు అభినందించారు.



సభలో మాట్లాడుతున్న వైసిపి ఉత్తరాంధ్ర కన్వీనర్ వైవి సుబ్బారెడ్డి

మిమ్స్‌కు నాయకులు, పోలీసులు వత్తాసు

అరెస్టులను ఖండించిన సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మిమ్స్ యాజమాన్యానికి పోలీసులు, రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ విమర్శించారు. మిమ్స్ ఉద్యోగుల అరెస్టును ఆయన ఖండించారు. వేతన సవరణ, ఇతర సమస్యల పరిష్కారంకోసం సుమారు 62రోజులుగా ఉద్యోగులు ఆందోళన చేపట్టినా పాలకులు, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని అన్నారు. పాలకులు సమస్య పరిష్కరించ కుండా పోలీసులను ఉసుగొల్పుతున్నారని అన్నారు. చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యాన్ని నిలదీయడం మానేసి, కార్మికులను రోడ్డున పడేయడం దుర్మార్గమన్నారు. వాస్తవాలను పక్కనబెట్టి, కార్మికుల శాంతియుత పోరాటాన్ని శాంతిభద్రతల సమస్యగా చిత్రీకరించడం సిగ్గుచేటన్నారు. మిమ్స్‌యాజమాన్య నిరంకుశత్వానికి పాలకులు, పోలీసులు తోడయ్యారని, ఇంతకన్నా అన్యాయం మరొకటి ఉండబోదని అన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చిత్తశుద్ధి చూపకపోతే మిమ్స్ ఉద్యోగుల ఆందోళన జిల్లా వ్యాప్తంగా విస్తరింప జేస్తామని హెచ్చరించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మిమ్స్ కార్మికులతోపాటు ఆవర్గమంతా పాలకులకు తగిన గుణపాఠం నేర్పుతుందని తెలిపారు.

నేటి నుంచి నూకాలమ్మ జాతర

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3 నుండి 8 వరకు నూకాలమ్మవారి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నామని నూకాలమ్మ యువజన సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, యడ్ల రాజేష్ తెలిపారు. మంగళవారం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో జాతరకు సంబంధించిన కరపత్రాలను, ఆహ్వాన పత్రాలను కమిటీ సభ్యులు ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా గురాన అయ్యలు, యడ్ల రాజేష్ మాట్లాడుతూ విజయనగరం మంగళవీధి, పాత పశువుల మార్కెట్ ఆవరణలో నూకాలమ్మ వారి 66వ వార్షికోత్సవ మహోత్సవాలను ఘనంగా నిర్వహించ డానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జాతర సందర్భంగా ప్రతీ రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 8న అమ్మవారి చల్లదనం మహోత్స వం, అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వజ్రపు నవీన్ కుమార్, యడ్ల భాస్కరరావు, రొంగలి శరత్ బాబు రాజేంద్రప్రసాద్, వెంకటరావు, పిన్నింటి సునీల్ , రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేశాం

వైసిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-బొబ్బిలి

వైసిపి పాలనలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టామని ఆపార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సూర్య రెసిడెన్సీ పక్కన వైసిపి నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అభివద్ధి, ప్రజా సంక్షేమానికి పని చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసిపి హయాంలో ప్రాజెక్టులు, సాగునీటి కాలువల పనులు చేపట్టామన్నారు. ఎంపి బెల్లాన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లి విజయానికి పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో పెత్తందారులకు, పేదలకు మధ్య యుద్ధం జరిగితే బొబ్బిలిలో ఒక జమీందారికి, బిసిలకు మధ్య యుద్ధం జరుగు తుందన్నారు. బొబ్బిలి నియోజు వర్గాన్ని అభివద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసిన బేబినాయన ఏవిధంగా ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. 15ఏళ్ల ఎమ్మెల్యేగా, రెండున్నరేళ్ల మంత్రిగా పని చేసిన రాజులు అభివద్ధి చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకష్ణ, పార్వతీపురం నియోజకవర్గ పరిశీలకులు తూముల భాస్కరరావు, ఎఎంసి చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, ఎంపిపిలు శంబంగి లక్ష్మి, చొక్కాపు లక్ష్మణరావు, భోగి గౌరి, మున్సిపల్ వైస్ చైర్మన్ తూముల అచ్యుతవల్లి, జెడ్‌పిటిసి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీ భవిష్యత్తు బాధ్యత నాది

నాగార్జునకు లోకేష్ భరోసా

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సీటును విజయనగరం పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జునకు కేటాయించక పోవడంతో తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన పార్టీపట్ల ధిక్కార స్వరం వినిపించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో విజయవాడ రావాలని లోకేష్ నుంచి పిలుపు రావడంతో నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పార్టీ నాయకులు మంగళవారం మధ్యాహ్నం వెళ్లారు. 2019లో తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయాక, చీపురుపల్లిలో ఓటమి పాలయ్యాక వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజల సమస్యలపై జిల్లాలో మొట్టమొదట రోడ్డెక్కింది నాగార్జునేని, ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారని నాలుగు మండలాలు నాయకులు లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పార్లమెంట్ అధ్యక్ష పదవి రాజీనామా వెనక్కి తీసుకొని జిల్లాలో ఎన్నికలు ప్రచారంలో పాల్గొనాలని కోరారు. నియోజక వర్గంలో 5సంవత్సరాల నుండి అతి చిన్న వయసులో పార్టీ కోసం బాగా పని చేశావని అన్నారు. నాగార్జున రాజకీయ భవిష్యత్తు చూసుకొనే బాధ్యత తనదని చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రచారం బాధ్యత తీసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో నాలుగు మండలాలు నాయకులు రౌతు కామునాయుడు, పైల బలరాం, వెన్నె సన్యాసి నాయుడు, దన్నాన రామ చంద్రుడు, తాడ్డే సన్యాసి నాయుడు, సారేపాక సురేష్ బాబు, చనమాల మహేశ్వర రావు,ముల్లు రమణ,పిళ్ళా అప్పలనాయుడు, మహంతి రమణ మూర్తి, మహంతి అప్పలనాయుడు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, మాజీలు పాల్గొన్నారు.

నాగార్జునను ఆలింగనం చేసుకుంటున్న లోకేష్

అవినీతిపై చర్చకు సిద్ధం : కాళ్ల

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని తాను అవినీతిపై అడుగుతుంటే ఆయన స్పందించకుండా వేరే వారితో సమాధానం చెప్పిస్తున్నారని టిడిపి నాయకులు కాళ్ల గౌరీశంకర్ అన్నారు. మంగళవారం నాగవంశపు వీధిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మున్సిపల్, మండల స్థాయిలో జరుగుతున్న అవినీతిపై బహిరంగంగా తెలపాలని కోరుతుంటే దాట వేస్తున్నారని తెలిపారు. భూములను ఇష్టారాజ్యంగా ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఎంతో నీతివంతంగా ఉన్న అశోక్ గజపతిరాజును మాన్సాస్ చైర్మన్‌గా తప్పించి వేరొకరిని తెచ్చి మాన్సాస్ భూములను ఆక్రమించుకోవడానికి కోలగట్ల ప్రయత్నించారని అన్నారు. రానున్న రోజుల్లో బహిరంగ మీటింగ్‌ల్లో కోలగట్ల అవినీతి బాగోతాన్ని బయట పెడతానని తెలిపారు. సమావేశంలో గాడు అప్పారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆటిజం పట్ల అవగాహన అవసరం

కిడ్స్ కేర్ ఎమ్‌డి పవన్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిల్లల్లో ఆటిజం సమస్యలను తల్లిదండ్రులు ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిదని విజయనగరం ఎ.కిడ్స్ కేర్ సంస్థ ఎమ్‌డి ఎన్.పవన్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న గణాంకాలు ప్రకారం ప్రస్తుతం పుడుతున్న ప్రతి పది మంది పిల్లల్లో ఆరుగురు ఆటిజం సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఆటిజంకు ఎటువంటి వైద్యం లేదని తెలిపారు. వారికి ఉన్న సమస్యలను వేగంగా గుర్తించి థెరపీ సెంటర్స్ ద్వారా వారికి అవసరమైన థెరపీలు ఇప్పించడం ద్వారా మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. పుట్టి మూడేళ్లు దాటినా మాటలు రాకపోవడం, కలర్స్‌ను గుర్తించకపోవడం, వారిలో వారే మాట్లాడుకుంటూ ఉండడం, ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడడం, ఆడుకోవడం, అదే పనిగా చేతులు కొట్టుకోవడం, వారిని వారే గాయపర్చుకుంటూ ఉండడం, మాట్లాడుతున్న వ్యక్తి వైపు చూడకుండా , వినకుండా వేరేవైపు చూడడం, ఎక్కువగా భయపడుతూ ఉండడం లాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే తమ ఏ.కిడ్స్ కేర్‌కు గాని, దగ్గర లో ఉన్న మరో థెరపీ కేంద్రానికి గాని వెళ్లి కౌన్సెలింగ్ తీసుకోవాలని తెలిపారు.

ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

- సదుపాయాల కల్పనకు సాక్ష్యం యాప్
- బ్రెయిలీలో నమూనా బ్యాలెట్ పేపర్, ఓటర్ స్లిప్పులు
- కలెక్టర్ నాగలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల్లో పాల్గొనే విభిన్న ప్రతిభావంతులకు ఎన్నికల కమిషన్ పలు ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తోందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకొని వికలాంగులంతా శతశాతం తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి అధ్యక్షతన కలెక్టర్ ఛాంబర్‌లో డిఎంసిఎఇ సమావేశం మంగళవారం జరిగింది. వికలాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాలను వివరించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలతోపాటు, వికలాంగుల సౌకర్యం కోసం ర్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ఎన్నికల కమిషన్ ప్రత్యేకంగా రూపొందించిన సాక్ష్యం యాప్, వారికి ఎంతో సహాయకారిగా ఉంటుందని, దీనిని ప్రతీఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఓటరు జాబితాలో వికలాంగులుగా నమోదై ఉండీ, సదరం ధ్రువపత్రం ప్రకారం తమకు 40శాతంపైబడి వికలాంగత్వం ఉంటే, వారు ఇంటివద్దనుంచే ఓటు వేసే అవకాశం ఉందన్నారు. సాక్ష్యం యాప్ ద్వారా హోమ్ ఓటింగ్ కోసం ముందస్తుగా ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రానికి చేరుకోవడానికి తమకు రవాణా సౌకర్యం కావాలన్నా, ఓటరు జాబితాలో పేరు తెలుసుకోవాలన్నా, తమ పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవాలన్నా, వీల్‌ఛైర్, వాలంటీర్ సౌకర్యం కాల్సివచ్చినా ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 580 వీల్ ఛైర్లను ఎన్నికల రోజు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అంధులకు బ్రెయిలీ లిపిలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సుమారు 10,550 మంది అంధులు ఓటర్ల జాబితాలో నమోదై ఉన్నారని చెప్పారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్దా బ్రెయిలీ లిపిలో నమూనా బ్యాలెట్ పేపర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇవిఎంలపైనా బ్రెయిలీ లిపిలో నంబర్లు ఉంటాయన్నారు. లేదా వాలంటీర్‌ను ఉపయోగించుకొని తమ ఓటుహక్కును వినియోగించు కోవచ్చునని సూచించారు. చూపు తక్కువగా ఉన్నవారికోసం భూతద్దాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. ఐదు దశల్లో ఓటు వేసే ప్రక్రియ పూర్తి అవుతుందని, ఇది కూడా చాలావరకు విభిన్న ప్రతిభావంతులకు అనుకూలంగానే రూపొందించామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఎడి జివిబి జగదీష్, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, సాంఘిక సంక్షేమాధికారి రామానందం, విద్యాశాఖ ఎడి బి.గౌరీశంకర్, కమిటీ సభ్యులు, సంక్షేమశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పింఛన్లు అందేలా చర్యలు తీసుకోండి

ఎంపిడిఒకు వినతినిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

వృద్ధు లు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్దిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయనగరం నియోజకవర్గ టిడిపి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజుతో పాటు పలువురు టిడిపి నాయకులు ఎంపిడిఒకు మంగళవారం వినతి నిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో నేరుగా నగదు పంపిణీ చేసే కార్యక్రమాల నుండి వాలంటీర్ వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసినందున వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. సంక్షేమ పథకాలు అందించడంలో తమ పార్టీ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బిసి నాయకులు వేచలపు శ్రీనివాసరావు, అవనాపు విజయ్, పిల్లా విజయ్ కుమార్, గాడు అప్పారావు, కనకల మురళీమోహన్ పాల్గొన్నారు.

మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని 13 ఆదర్శపాఠశాలలలో 2024 -25 విద్యా సంవత్సరానికి ఇంటర్‌లో మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో బోధన ఇంగ్లీషులో ఉంటుందన్నారు. ఎటువంటి ఫీజులు ఉండవన్నారు. జిల్లాలోని ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమాచారం కోసం వెబ్ సైట్ https://apms.apcfss.in, https://www.cse.ap.gov.in లో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తు చేసేందుకు ఒసి, బిసి, ఇడబ్ల్యుసి విద్యార్థులకు ప్రవేశ రుసుము రూ.200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ. 150 ఉంటుందన్నారు. ఇతర వివరాలకు సంబంధిత ఆదర్శ పాఠశాలల ప్రధానాచార్యులను సంప్రదించాలని సూచించారు

వృద్ధులు, వికలాంగులతో చెలగాటం

ప్రభుత్వ పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

అభివృద్ధి, సంక్షేమానికి మద్దతివ్వండి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ ప్రాంతంలో జరిగే అభివృద్ధి, సంక్షేమానికే ఓటేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని గుంపాం, తొత్తడాం గ్రామాల్లో వైసిపి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందించే ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. మరోసారి నెల్లిమర్ల వైసిపి ఎమ్మెల్యేగా తననూ, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను ఆశీర్వదించాలన్నారు. వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరేందుకు ఈ ప్రభుత్వం మరల రావాలన్నారు. ప్రచారంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, గుంపాం నాయకులు యడ్ల రామకృష్ణ, నాయకులు మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, దేశెట్టి గణేష్, పట్టెపు శ్రీనువాసరావు, పిన్నింటి యల్లంనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

వియ్యంపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ, దంత వైద్యులు డాక్టర్ మధు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులంలో ప్రిన్సిపాల్ టి. జయశ్రీ అధ్యక్షతన దంతాలు పరిశుభ్రత పై మంగళవారం అవగాహనా కల్పించినట్లు హెల్త్ సూపర్ వైజర్ ఈశ్వరరావు తెలిపారు. 2024లో హ్యాపీ మౌత్ ఈజ్ హ్యాపీ బాడీ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. వ్యక్తులతో బాటు ఆరోగ్య వ్యవస్థలను, ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేసే నోటి సంబంధిత వ్యాధులు భారాన్ని తగ్గించే లక్ష్యంతో నోటి పరిశుభ్రతడే ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. దంతాలు, చిగుళ్ళు, నాలుక ఆరోగ్యం పై జాగ్రత్తలు తీసుకోపోతే దాని ప్రభావం శరీర అవయవాలు పై పడుతుందని, దాని వల్ల నోటి కేన్సర్, మధు మేహం వంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. నోటి సంబంధిత వ్యాధులు ప్రధాన కారణం జీవన శైలి, ఆహార అలవాట్లు, దూమపానం అని తెలిపారు. పెద్దలు, పిల్లలు దంతావనం శుభ్రంగా చేయాలనీ తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొని ర్యాలీ నిర్వహించారు.

నగర పంచాయతీ సిబ్బందికి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో శతశాతం పన్ను వసూళ్ల చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన నెల్లిమర్ల నగర పంచాయతీ సిబ్బందిని మంగళవారం కమిషనర్ బాలాజీ ప్రసాద్ ఘనంగా సత్కరించారు. గాంధీ నగర కాలనీ, మొయిద జంక్షన్-02 సచివాలయంలోని వార్డు పరిపాలన కార్యదర్శులను కూడా సత్కరించారు. పన్నులు వసూల్లో నిరంతరం వార్డు పరిపాలన కార్యదర్శులకు, ఇతర సిబ్బందికి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేసి రాష్ట్ర స్థాయిలో నెల్లిమర్ల నగర పంచాయతీని ప్రథమ స్థానం సాధించడానికి కృషి చేసిన నగర పంచాయతీ మేనేజర్ టివిఎస్ విశ్వేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ.రాజ్యలక్ష్మి, గుమస్తా బి.తులసిని కమిషనర్, సిబ్బంది సత్కరించారు. అనంతరం ఆస్థి పన్నులు వసూలు విషయంలో ప్రోత్సహించిన కమిషనర్‌ను కూడా సిబ్బంది సత్కరించారు.

కాంగ్రెసులో బిసిలకు అన్యాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

కాంగ్రెసులో బిసిలకు అన్యాయం జరిగిందని రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్వల శ్రీనివాసరావు అన్నారు. కాంగ్రెసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధిక శాతం ఉన్న బిసిలకు పార్లమెంట్, అసెంబ్లీ టికెట్లు ఇవ్వకుండా తక్కువ జనాభా ఉన్నవారికి ఇవ్వడం అన్యాయమన్నారు. బిసిలకు న్యాయం చేయాలని రాష్ట్ర అధిష్టానాన్ని డిమాండ్ చేశారు.

పట్టణంలో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని 13వ వార్డులో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబినాయన మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓటును అభ్యర్థించారు. రానున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజల పక్షాన పని చేస్తామన్నారు. అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి ముందుకు వెళ్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో డ్రైవింగ్ శిక్షణ

విజయనగరంకోట: విజయనగరం ఆర్టీసీ డిపోలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌పై శిక్షణ తరగతులను మంగళవారం జిల్లా ప్రజా రవాణా అధికారి సిహెచ్ అప్పల నారాయణ ప్రారంభించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న వీరు మంచి డ్రైవర్లుగా తయారు కావాలని ఆకాంక్షించారు శిక్షణ కాలంలో పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఉన్నతమైన డ్రైవర్లుగా తయారు కావాలని కోరారు. డిపో మేనేజర్ జె. శ్రీనివాసరావు, ట్రైనర్ రాజు పాల్గొన్నారు

ఘనంగా బాలల పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి - తెర్లాం

స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు, విద్యార్థులకు, పుస్తకం తాలూకా విలువలు గురించి ఉపాధ్యాయులు సిహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. పుస్తకాలు మానసిక స్థితుగతులను మార్చుతాయన్నారు.

నేరాలు ఘోరాలు

గడ్డి మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడకు చెందిన రెడ్డి రాజేష్‌కుమార్ (26) గడ్డి మందు తాగి మంగళవారం మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. తన ఇంటికి సమీపంలో ఉన్న కల్లం వద్ద గడ్డిమందని సోమవారం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. తన తండ్రి సత్యనారాయణ చూసి వెంటనే స్థానిక పిహెచ్‌సికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాద నష్టం అంచనా

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సింగరాయిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం నష్టాన్ని రెవెన్యూ అధికారులు మంగళవారం అంచనా వేశారు. ఏఎన్ఆర్ ఎస్టేట్‌లో ఉన్న శ్రీగంధపు మొక్కలు సుమారు 23 లక్షల విలువైనవి అగ్నికి ఆహుతయ్యాయని, రూ.2లక్షలు విలువైన నాలుగు ట్రాక్టర్లతో తెచ్చిన వాటర్ పైపులు కాలి బూడిదయ్యాయని ఆర్ఐ రామలక్ష్మి తెలిపారు. ఈ నివేదికను తహశీల్దార్‌కు సమర్పిస్తామన్నారు. ఈ దర్యాప్తులో గ్రామ రెవెన్యూ అధికారిని సత్యవతి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని చేపలకంచేరులో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన మైలపల్లి దానయ్యమ్మ ఇంట్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు ఆపే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో సుమారు రెండు లక్షల నగదుతో పాటు నాలుగు తులాల బంగారం కాలిపోయిందని బాధితులు చెబుతున్నారు.

ప్రజాశక్తి - బొబ్బిలి

రాజకీయ లబ్ధి కోసం సామాజిక పింఛన్ దారులతో వైసిపి ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని టిడిపి, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన అన్నారు. కోటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదల జీవితాలు, సామాజిక పింఛన్ దారులతో చెలగాటం ఆడుతుందని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం పింఛన్ల పంపిణీ టిడిపి అడ్డుకుందని వైసిపి నేతలు గోబెల్ ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు వల్లనే పింఛన్ల పంపిణీ ఆగిపోయిందని తప్పుడు ప్రచారం చేయడం అన్యాయమన్నారు. వాలంటీర్ వ్యవస్థను టిడిపి వ్యతిరేకం కాదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. రాజకీయాలకు వాలంటీర్లను వాడుకోరాదని టిడిపి వ్యతిరేకమని చెప్పారు. రాష్ట్రంలో పింఛన్ దారులకు చెల్లించాల్సిన రూ.13వేల కోట్లు వైసిపి కాంట్రాక్టర్లకు చెల్లించారని విమర్శించారు. ఎన్నికల కోడ్ వుండుగానే కాంట్రాక్టర్లకు పింఛన్ల సొమ్ము ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్షా 35వేల మంది సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు ఉన్నారన్నారు, వీరితో ఎందుకు పింఛన్లు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. పేద ప్రజలను ఇబ్బందులు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం సిగ్గు చేటన్నారు. ఈ నెల 5 లోగా పింఛన్లు ఇంటింటికి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే పింఛన్ రూ.4వేలు ఇంటింటికీ పింఛన్ ఇస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

బేబినాయన

పింఛన్లు అందించాలని వినతి

వేపాడ: మండలంలో సామాజిక పింఛన్లను సచివాలయం సిబ్బందితో పంపిణీ చేయించాలని ఎంపిడిఒ అనిచ్చితకు మంగళవారం నాయకులు గొంప వెంకటరావు, గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, పి.రమణ వినతి పత్రాన్నిచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సామాజిక పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జి రాము, ఎం ముత్యాల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ ఇచ్చే ఏర్పాట్లు చేయాలి

పూసపాటిరేగ: వృద్ధులకు, వికలాంగులకు ఇళ్ల వద్దనే పింఛన్లు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, పిన్నింటి సత్యనారాయుడు మంగళవారం ఎంపిడిఒ రాధికకు వినతి అందించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో నేరుగా నగదు పంపిణీ చేసే వాలంటీర్ల వ్యవస్థను తప్పిస్తూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు చేశారన్నారు. ఈ నేపథ్యంలో పింఛన్ పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు ద్వారా పంపిణీ ఏర్పాట్లు చేయాలని కోరారు. లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

బొబ్బిలి: వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం ఆలస్యం వహిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. మంగళవారం బొబ్బిలి సిపిఐ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికల సంఘం వాలంటీర్లను పక్కన పెడితే దానికి చంద్రబాబు, నిమ్మగడ్డ ప్రసాద్, ప్రతిపక్షాల కారణం అంటూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి పింఛన్లు అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, మండల కార్యదర్శి తాడంగి ఎండయోర తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: ఇంటింటికి పింఛను పంపిణీ చేయాలని టిడిపి మండల అధ్యక్షులు తెంటు రవిబాబు, టిడిపి జిల్లా బీసీ సాధికారిక కన్వీనర్ కొల్ల అప్పలనాయుడు ఒక ప్రకటనలో కోరారు. నాయకులు మాట్లాడుతూ కావాలనే పింఛన్ పంపిణీ లేట్ చేస్తున్నారని ఇదంతా జగన్ ఆడే జగన్ నాటకం అని అన్నారు.

జామి: ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకుని వాలంటీర్లను ప్రభుత్వ కార్యకలాపాలకు వాడొద్దని కమిషన్ ఆదేశాల మేరకు సచివాలయం సిబ్బందితో పింఛన్లు పంపిణీ ఇంటి వద్దే చేపట్టాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు. పింఛన్ల పంపిణీ విషయంలో వైసిపి తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. ఖజానాలో నిధులు లేకపోవడం, పింఛన్ల పంపిణీని టిడిపి అడ్డుకుందని చెప్పడం సిగ్గు చేటన్నారు. తక్షణమే పింఛన్లు పంపిణీ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పెదబాబు, టిడిపి నాయకులు వర్రీ రమణ, శ్రీలక్ష్మి, కొత్తలి సూర్యారావు, స్వామినాయుడు, రాయవరపు శంకరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వేపాడ: ఎంపిడిఒకు వినతిస్తున్న టిడిపి నాయకులు, వృద్ధులు

శృంగవరపుకోట: అవ్వ, తాతలకు ఇస్తామని చెబుతున్న రూ.13 వేల కోట్లు పెన్షన్ సొమ్ము ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా సొంత కాంట్రాక్టర్లకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి దోచి పెట్టారని దీంతో నిధులు కొరత ఏర్పడి పింఛన్లు పంపిణీ చేయలేదని, టిడిపి మండల అధ్యక్షుడు జిఎస్ నాయుడు అన్నారు. వైసిపి తమపై దుష్ప్రచారం చేస్తుందని దీనిని అరికట్టాలని కోరుతూ ఎంపిడిఒ సాంబశివరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి వెంకన్న, మల్లేశ్వరరావు, రామకృష్ణ, చిన్నికృష్ణ, వాసు, చెక్క కిరణ్, బి.శెట్టి అరుణ, ఇందుకురి శ్రీనివాసరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

గొంప కృష్ణ గ్రూపుతో భరత్ భేటీ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఎస్‌కోట నియోజకవర్గంలోని గొంప కృష్ణ గ్రూపుతో టిడిపి ఎంపి అభ్యర్థి శ్రీభరత్ మంగళవారం భేటీ అయ్యారు. ఐదు మండలాల టిడిపి అధ్యక్షులుగా రాజీనామ చేసిన గొంప వెంకటరావు, రాయవరపు చంద్రశేఖర్, లఘుడు రవి, గొరపల్లి రాము, ఎస్‌కోట నియోజకవర్గం మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతీలతో ఆయన ఎస్‌కోటలోని గొంప కృష్ణ నివాసంలో సమావేశమయ్యారు. సుమారు నాలుగు గంటలు పాటు చర్చించారు. ఈ చర్చల్లో కచ్చితంగా గొంప కృష్ణకు టిక్కెట్టు ఇస్తేనే తామంతా టిడిపికి పనిచేస్తామని లేకపోతే కృష్ణను ఇండిపెండెంట్‌గా పోటి చేయించి విజయం సాధిస్తామని చెప్పారు. అవసరమైతే ఎంపీగా తమకు మాత్రం ఓటేస్తాం కానీ కోళ్ల లలితకుమారికి మాత్రం వేయమని ఖరాఖండీగా చెప్పారు. అనంతరం భరత్ మాట్లాడుతూ తప్పు జరగడం వాస్తవమేనని నియోజకవర్గాన్ని గొంప కృష్ణ పార్టీ పరంగా బాగా అభివృద్ధి చేశారని ఆయనకు తాను కూడా రుణపడి ఉంటానని అన్నారు. కృష్ణకు టికెట్ ఇవ్వకపోవడం వల్ల మీరు పడుతున్న అవమానాలను అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లి రెండు రోజుల్లో సమస్య పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

నాయకులతో మాట్లాడుతున్న భరత్

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి- బొబ్బిలి

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దని మున్సిపల్ పారిశుధ్య కార్మికులను కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. పట్టణంలోని మిలటరీ కాలనీ, బోస్ నగర్, రాజ్ మహల్, రామన్నదొరవలసలో మంగళవారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహించకుండా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులకు చెత్త ఇవ్వాలని ప్రజలను కోరారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య కార్మికుల పనిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో మున్సిపల్ ఎఇ సురేష్, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నిర్వహణ మెరుగుపరచాలి

మున్సిపాలిటీలో వీధి దీపాలు, కుళాయిలు నిర్వహణ మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయ సెక్రటరీ వారివార్డులో వీధి దీపాలు, కుళాయి నిర్వహణపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. వార్డులలో కుళాయి కనెక్షన్లు, వీధి దీపాలు, మంచినీటి బావులు, చేతిపంపు బోర్లు ఎన్ని ఉన్నాయో గుర్తించాలని కోరారు. వాటి పనితీరుపై నివేదిక ఇవ్వాలన్నారు. వార్డులలో ఏ అభివృద్ధి పనులు చేయాలో గుర్తించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ డిఇ రవికుమార్, ఎఇ సురేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాడంగిలో ప్రపంచ ఆటిజం దినోత్సవం

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం టివి లక్ష్మి, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రపంచ ఆటిజం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా ఏప్రిల్ 2న ఆటిజంపై ప్రజలలో అవగాహన కోసం ప్రపంచ వ్యాప్తంగా ఆటిజం దినోత్సవం జరుపుతున్నారని అన్నారు. ఆటిజం అనేది వ్యాధికాదని అది ఒక మానసిక స్థితి అని గుర్తు చేశారు. వీరిలో కమ్యూనికేషన్ సమస్యలు, ఒంటరితనం ఎక్కువగా ఉంటుందని ఈ ఆటిజం స్థితి రావటానికి కారణాలు 15-20 శాతం జన్యుపరమైన లోపాలేనని అన్నారు. 35 ఏళ్ళు దాటిన వారు పిల్లలను కనటం, పోషకాహార లోపం వల్లే ఇదే వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ఆటిజానికి కచ్చితమైన చికిత్స అంటూ ఏమీ లేదని ప్రతి ఒక్కరికి వారి లక్షణాలను బట్టి ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ వల్ల కొంతవరకు పిల్లలకు మానసిక సమస్యల నుండి దూరం చేయొచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామారావు, శంకరరావు, నారెమ్మ, విజయమ్మ, కళ్యాణి, రామకృష్ణ, పీడీ బంగారునాయుడు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పరిశీలన

ప్రజాశక్తి- బొండపల్లి

మండలంలోని ఒంపల్లిలో జరిగిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిబిరంలో హాజరైన వైద్యులు, రోగులతో మాట్లాడి, ఆరోగ్య సౌకర్యాలు గురించి ఆరా తీశారు. స్థానిక సిహెచ్‌సిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్.సత్యనారాయణ, సిహెచ్‌ఒ రాజగోపాల్ రావు, పిఎంఒ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్ బి.విశ్వేశ్వర రావు, ఆశాలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

శిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కొంపల్లి, సింగరాయి, దొగ్గపేట పాఠశాలలను ఎంఇఒ బాలభాస్కరావు మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న ఎండిఎం అమలు విధానం పైన, విద్యార్థులు వర్క్ బుక్స్, ఉపాధ్యాయుల డైరీలు, పాఠశాల మరుగుదొడ్లను, రికార్డులను పరిశీలించారు. ఈ పరిశీలనలో ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య శిబిరం

వేపాడ: మండలంలోని నల్లబెల్లి గ్రామ సచివాలయం ఆవరణలో గర్భిణులు, స్త్రీల వ్యాధులకు సంబంధించి మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 407 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరులో 5 గురుని మెరుగైన వైద్య సేవలు కోసం రిఫర్ చేశారు. ఈ వైద్య శిబిరంలో వేపాడ పిహెచ్‌సి వైద్యాధికారి ఎ.ధరణి, డాక్టర్ దివ్య, ఎన్ఎ ఆచారి, సిహెచ్ ఈశ్వర రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి, కండ్ల కలకలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు.

గ్రామాల్లో పోలీసు కవాతు

డెంకాడ: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని డెంకాడ, పెద్దతాడివాడ, గునుపూరు, పినతాడివాడ గ్రామాల్లో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. భోగాపురం సిఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తమ సిబ్బంది, సెంట్రల్ ఫోర్స్ సిబ్బంది ఈ కవాతును నిర్వహించినట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు..

జంతు చట్టాలపై శిక్షణ

ప్రజాశక్తి - జామి

జంతు హింస, జంతు రవాణా చట్టాలపై ఈ నెల 7న శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శిక్షణ కార్యక్రమానికి సంబందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోగిశ మాట్లాడుతూ జిల్లాలో పశువులు అక్రమ రవాణా, గో మాంసం రవాణా, అక్రమ సంతలు ఎక్కువ అయిపోయాయన్నారు. అందులో భాగంగానే విజయనగరం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమానికి హైకోర్ట్ న్యాయవాదులు, జంతు సంక్షేమ చట్టాలు ట్రైనర్స్ పాల్గొని, అక్రమార్కులపై అసలు కేసులు ఎలా నమోదు చేయాలో వారికి శిక్షణ ఇవ్వనునట్లు తెలిపారు. జిల్లాలోని జంతు సంక్షేమ కార్యకర్తలు, జీవ కారుణ్యవాదులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కేవీర్ సత్యనారాయణ, జిల్లా మహిళా అధ్యక్షులు చోళ్ల రాజకుమారి, జిల్లా కార్యవర్గ సభ్యులు నడిపేనా సత్యవతి, పవన్ కుమార్, కోట అప్పన్న, బెల్లాన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమ సమాజమే ధ్యేయంగా పని చేయాలి

పిడిఎస్‌ఒ రాష్ట్ర కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమ సమాజ నిర్మాణం కోసం యువత అంకితభావంతో పనిచేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఒ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభ జరిగింది. నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎం. అప్పలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎ.సురేష్ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. చిన్న వయసులోనే సోషలిస్ట్ సమాజ నిర్మాణం కోసం అంకితభావంతో పోరాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేడు దేశంలోను, రాష్ట్రంలో అధికారం చేపట్టిన వారు ప్రజలను మోసం చేస్తూ మన సహజ సంపదను, స్వదేశీ, విదేశీ, బడా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. చదువుకున్న యువతకు సరైన ఉపాధిని చూపించకుండా శ్రమ దోపిడీ జరుగుతోందని అన్నారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు, యువకులు తమ సమస్యలపై స్పందించి ప్రభుత్వాలు అనుసరిస్తున్న దోపిడీ విధానాలపై అమరుల స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌వైఎస్ నగర కన్వీనర్ బి.గిరిప్రసాద్, పిడిఎస్‌ఒ జిల్లా అధ్యక్షులు కె.సోమేష్, నాయకులు నాయకులు బి. రాకేష్, సిహెచ్ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటమ్మ పాలధార

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు కొట్టం కోటమ్మ తల్లి పాలధార మహోత్సవం అంగరంగ వైభవంగా వేలాదిమంది యాత్రికల సమక్షంలో కన్నుల పండువగా జరిగింది. మంగళవారం ఆలయ ఇఒ నాగేంద్ర గ్రామ పెద్ద సేనాపతి కోటరావునాయుడులు గద్దికుడులో పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కోటరావునాయుడు ఆధ్వర్యంలో అమ్మవారి పూజారులను ఊరేగించగా యువత కర్రలను గాలిలో కొడుతూ ముందుకు కదిలారు. అలా కొట్టడం వల్ల ఊరిలో ఉన్న దుష్ట గ్రహాలు పారిపోతాయని గ్రామం చల్లగా ఉంటుందని పెద్దలు తెలిపారు. అనంతరం చిన్నమ్మి గుడి వద్ద అమ్మవారికి పూజలు చేశారు. పోతురాజుకు ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి ప్రతిమగా భావించే పసుపు ముద్దను ఊరంతా తిప్పారు. అనం తరం గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. బుధవారం సిరిమాను ఉత్సవం జరగనుందని సుమారు లక్షకు పైగా యాత్రికలు హాజరవుతారని ఇఒ నాగేంద్ర తెలిపారు.

పాలధారలో కర్రలతో పాల్గొన్న గ్రామస్తులు

'టిడిపితోనే బిసిలకు న్యాయం'

ప్రజాశక్తి- బొండపల్లి

టిడిపితోనే బిసిలకు న్యాయం జరుగుతోందని ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నెలివాడ ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం క్లస్టర్ ఇంచార్జ్ శనపతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. టిడిపి ప్రభుత్వంలో బిసి కార్పొరేషన్ ద్వారా చేతివృత్తులకు, కుల వృత్తుల వారికీ రాయితీల ద్వారా ఆదరణ పరికరాలు అందించారని గుర్తు చేశారు. జగన్ రెడ్డి రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు పునరిద్దరిస్తామని, శాశ్వత కుల ధృవీకరణ పత్రాలు అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్చార్జిలు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ ఇంచార్జ్‌లు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, జనసేన, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పికి స్టాపర్లు అందజేసిన బ్యాంకు ఆర్ఎం శ్రీనివాసరావు

పోలీసుశాఖకు స్టాపర్లు వితరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

యూనియన్ బ్యాంకు అధికారులు విజయనగరం పోలీసులకు ఏడు స్టాపర్లను వితరణగా అందజేశారు. మంగళవారం డిఎస్‌పి కార్యాలయం వద్ద వాటిని అప్పగించినట్లు డిఎస్‌పి ఆర్. గోవిందరావు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ - విజయనగరం పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ,వాహనాల మళ్లింపు, వాహన తనిఖీలు సమయాల్లోను వినియోగించే స్టాపర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోలీసుల అవసరాలను గుర్తించి, విధి నిర్వహణలో ఉపయోగపడే ఏడు స్టాపర్లను యూనియన్ బ్యాంకు అధికారులు వితరణగా ఇవ్వడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథ్, యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజనల్ హెడ్ ఎ.శ్రీనివాసరావు, డిజి పట్నాయక్, విశ్వనాథ్, విజయనగరం 2వ పట్టణ సిఐ కె.రామారావు, రూరల్ సిఐ ఎం. శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్ఐ లోవరాజు, ఎ.ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'జన విజయ యాత్ర'

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని గుణుపూరుపేట, ఆర్.ముంగినాపల్లి, కె.ముంగినాపల్లి, రెడ్డిక పేటలో 'జన విజయ యాత్రలో' భాగంగా గడపగడపకు తిరిగి గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేయాలని జనసేన, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి కోరారు. ఈ సారి తనకు అవకాశం ఇవ్వాలని కోరడంతో ప్రజలు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మినాయుడు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, పూసపాటిరేగ టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, అల్లాడపాలెం మాజీ సర్పంచ్ లంకలపల్లి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మహిళా రీజనల్ కోఆర్డినేటర్ తుమ్మలక్ష్మీ రాజ్, విక్రమ్ జగన్నాథం, కోనైపాలెం ఎంపిటిసి పసుపులేటి గోపి, జనసేన పార్టీ మండలం సీనియర్ నాయకులు పతివాడ శ్రీనివాస్, చిన్న రాము, పైలా శంకర్, అట్టాడ ప్రమీల, తొత్తడి ప్రకాష్, దిండి రామారావు, కోరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న లోకం మాధవి

టిడిపి ఆధ్వర్యాన మహిళా మేలుకో

ప్రజాశక్తి-విజయనగరం కోట

తెలుగు మహిళా ఆధ్వర్యంలో మంగళవారం నాడు 21వ , 45వ డివిజన్‌లలో 'మహిళా మేలుకో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం నియోజకవర్గ నాయకులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ టిడిపిని స్థాపించిన తరువాతే మహిళలకు గుర్తింపు వచ్చిందన్నారు. మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించారని, చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పించారని అన్నారు. ఇటీవల అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా సాధికారత దిశగా టిడిపి, జనసేనఉమ్మడిగా ప్రకటించిన 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకం గురించి చెబుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలకు వత్తిపరమైన విద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమని వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సభ్యులు సువ్వారి అనురాధ బేగం, పత్తిగిల్లి సూర్యకుమారి, కంది శమంతకమణి, అవనాపు భార్గవి, మరిపిన పద్మలత, సుంకరి సునీత, సియ్యదూల ఝాన్సీ, కోరాడ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

గజపతినగరం: మండలంలోని కెంగువ గ్రామానికి చెందిన 2వ వార్డు మెంబరు కొండల అక్కమ్మ, కొండల సూరి, కొండల సూరిబాబు, కొండల అప్పారావు, కొండల భద్రమ్మ, కొండల రాము, కొండల ఆదమ్మ, కొండల రాంబాబు, లోగిశ సత్యం, పెనుమజ్జి రాము, బూడి అప్పలనాయుడు తదితరులు వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకట్రావు, నాయకులు బెల్లాన త్రినాథ్, సామంతుల పైడిరాజు, లెంక శ్రీనివాసరావు, మజ్జి రామకృష్ణ, సర్పంచ్ కొండల సూరప్పడు, ఎంపిటిసి శ్రీను, వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, లెంక గణేష్ పాల్గొన్నారు.